కథ

# లాంతరు

● అలపర్తి రామకృష్ణ ●

మళ్ళీ కరెంటు పోయింది.

పల్లెటూళ్ళో కరెంటు పోవడం, చీకటి పడటం ఎంత సహజమో అంత సహజం.

మళ్ళీ వెలుగు వస్తుందనే ఆశ గ్రామస్థులకు లేదు. అన్నాలు తినేసి ఆరుబయట మంచాలు వేసుకుని నిద్రలోకి జారుకునే ప్రయత్నంలో వున్నారు వాళ్ళు. కరెంటు మోటారు వున్న రైతులు మాత్రం తరుచుగా కరెంటు పోవడం చూసి మనస్సులో తిట్టుకుంటున్నారు.

ఇంటి ముందు పడక కుర్చీ వేసుకుని కూర్చున్నాడు నారాయణ.

ఊరిబయట యిల్లు కావడంతో వరిపొలాల మీద వెన్నెల పరుచుకుని కన్పిస్తూ వుంది. రోడ్డు మీద జనసంచారం లేదు.

కొబ్బరి చెట్ల ఆకుల గలగలలు తప్పితే ఏ శబ్దం విన్పించడం లేదు. దూరాన కన్పిస్తున్న కొండల వైపు చూస్తూ కూర్చున్నాడు. విచ్చుకున్న మల్లె పూల వాసన ముక్కుపుటాలకు తగిలి ఎంతో హాయి కల్గించిందతనికి.

ప్రశాంతంగా, నిర్మలంగా వున్న తటాకంలోకి ఎవరో రాయి విసిరినట్లుగా అతని ప్రశాంతతను భగ్నం చేస్తూ కిరోసిన్ వాసన ఘాటుగా ముక్కుల్లోకి దూరింది.

"ఏం చేస్తున్నావ్ అమ్మమ్మా?" పెద్దగా కేకేశాడు నారాయణ.

"లాంతరులో కిరోసిన్ అయిపోయినట్లుంది. కిరోసిన్ లాంతరులో పోస్తుంటే కిందపోయినట్లుంది. అంతా చీకటిమేళం" ఇంట్లో నుంచి దుర్గమ్మ సమాధానం విన్పించింది.

"ఆ పాతలాంతరుతో కుస్తీ పట్లు పట్టొద్దంటే వినవు కదా! కొవ్వొత్తులు తెస్తే అందరికీ సందేరం జేస్తావ్! ఇంట్లో ఒక్క కొవ్వొత్తి వుంచవ్.... కొత్త లాంతరు కొనమన్నా వినవ్ గదా!" అన్నాడు నారాయణ.

నారాయణకు ఆరేళ్ళ వయస్సు వున్నప్పుడు తల్లిదండ్రులు బస్సు ప్రమాదంలో చనిపోయారు. నారాయణను దుర్గమ్మే పెంచింది. మనవడికి తన మొగుడి పేరే వుండటంతో వాడంటే పంచప్రాణాలు. వాడి పేరు తలచుకున్నప్పుడల్లా దేవుడిని తలుచుకున్నట్లేనని ఆమె అనుకుంటుంది.

దుర్గమ్మకి ఆరుగురు కొడుకులు. ఒక్కతే కూతురు. కొడుకుల పిల్లల్ని ఒక్కడిని దగ్గరకు తీయదు. కూతురు కొడుకంటేనే ఆమెకు పంచప్రాణాలు. తనకు రావాల్సిన వాటా కొడుకుల నుండి రాబట్టి తన వాటా పొలం మీద వచ్చే ఆదాయంతో మనవడిని చదివించింది. మనవడికి కొంచెం ఒళ్ళు వెచ్చబడినా తట్టుకోలేదు ఆమె. కంటికి రెప్పలా కాపాడుకుంటూ వాడిని పెంచి పెద్ద చేసింది.

నారాయణ పశువుల డాక్టరయ్యాడు.

ఊళ్ళో ఎవ్వరితో పెద్దగా మాట్లాడడు. తన పనేమిటో తానే గాని పోసుకోలు కబుర్లు చెప్పడం అతనికి సుతారామూ యిష్టం లేదు. హాస్పిటల్‌కు వెళ్ళడం, పశువుల్ని పరీక్షచేయడం తీరిక సమయాల్లో తోటల్లో చేలల్లో తిరగడం చీకటి పడగనే యింటికి తిరిగి రావడం అదీ అతని దినచర్య.

మూగ జీవాలతో మూగ సైగలు చేస్తూ తనలో తానే మాట్లాడుకుంటూ వైద్యం చేసే నారాయణను చూసి ఊళ్ళోవాళ్ళందరూ నవ్వుకుంటు వుంటారు.

హరికేన్ లాంతరు వెలుతురు ఇంట్లో పరుచుకుంది.

లాంతరు పట్టుకుని బయటకు వచ్చింది దుర్గమ్మ.

"లాంతరు అడుగుభాగంలో చిల్లుబడినట్లుందిరా నారాయణా..... ఒక్కోబొట్టు కిరసనాయిలు కారుతోందిరా.... టౌనుకు వెళ్లినప్పుడు ఈ లాంతరు పట్టుకెళ్ళి బాగుచేయించరా నాయనా!" అంది దుర్గమ్మ.

"ఆ లాంతరు తీసుకెళ్లి తుంగలో తొక్కు...

●●●

కథల పోటీల్లో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ

●●●

పది కొత్త లాంతర్లు కొనుక్కు వస్తానుగాని ఆ పాత లాంతరు ఊసు నా ముందు ఎత్తకు'' విసుక్కున్నాడు నారాయణ.

దుర్గమ్మకు దుఃఖం పొర్లుకు వచ్చింది.

"నేను ముసలిదాన్ని అయిపోయాను నాయనా! నన్నూ ఏట్లోపడేసి నువ్వు సుఖంగా వుండు'' అందామె.

"ఏదో నవ్వుతూ అన్నాను లేవే.... లాంతరు బాగుచేయిస్తానులే'' దుర్గమ్మను సముదాయించే ప్రయత్నం చెయ్యబోయాడు.

గోడకు చేరబడి కళ్ళు వత్తుకుంటూ కూర్చుంది దుర్గమ్మ.

ఆమె కళ్ళల్లో పాతజ్ఞాపకాలు సినిమా రీళ్ళల్లా కదిలేయి.

దుర్గమ్మకు పెళ్ళయిన కొత్తలో భర్తతో కలిసి సంతకు వెళ్ళింది.

**•••**


**మనవడికి తన మొగుడి పేరే వుండటంతో వాడంటే పంచప్రాణాలు.**

**•••**

మొగుడు పెళ్ళాలు చెట్టాపట్టాలు వేసుకుని సంత హడావుడిగా అంతా తమదేనన్నట్లు తిరగేరు. చెరుకురసం తాగేరు. మిరపకాయ బజ్జీలు తిన్నారు.

"కాళ్ళకు వెండి పట్టీలు కొనుక్కో'' అన్నాడు దుర్గమ్మ మొగుడు.

"నాకొద్దు... పక్కన నువ్వుంటే బంగారం



## 'బాయ్ ఫ్రెండ్' ప్రారంభం



నాలుగు సార్లు వాయిదా పడిన 'బాయ్ ఫ్రెండ్' చిత్రం ఎట్టకేలకు గతవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఈ చిత్రం ద్వారా మరో హిందీనటి తెలుగు తెరకు పరిచయం అవుతోంది. ఉత్తరాదిలో సంచలనం సృష్టించిన పూజాభట్ ఈ చిత్రంలో నాయిక. సాయికృష్ణ అనే ఇంజనీర్ హీరోగా నటిస్తున్నాడు. డా.అంబేద్కర్ చిత్రం ద్వారా గుర్తింపు తెచ్చుకున్న భరత్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. హైదరాబాద్‌లో జూన్ 14వ తేదీన చిత్ర ప్రముఖులు అతిధులుగా రాగా ఈ చిత్రం ప్రారంభమైంది.

— నారాయణరాజు.

లా మెరిసిపోతాను.... వెండి పట్టీలు నాకెందుకు?"

"మరేం కావాలి?" మురిపెంగా అడిగేడు.

"లాంతరు కొనిపెట్టు... మన పాక అంతా వెలుతురుతో నింపాలి"

"అందరూ బంగారం, వెండి నగలు కావాలంటారు.... లాంతరు కొనిపెట్టమని అడిగే పిచ్చిది ఎవరూ వుండరు" అనేసి పెద్దగా నవ్వేడు దుర్గమ్మ మొగుడు.

దుర్గమ్మకు నచ్చిన పెద్ద హరికేన్ లాంతరు కొనిపెట్టాడు.

ఆ లాంతరు వెలుగులో ఆ రాత్రి మొగుడి కౌగిట్లో కరిగిపోయిందామె.

అదే లాంతరు వెలుగులో పండంటి ఆడబిడ్డను కన్నది.

ధాన్యం వ్యాపారంలో భర్తకు కలిసొచ్చి లాంతరు వెలుగులో నోట్ల కట్టలు లెక్కపెట్టుకుంటుంటే తృప్తిగా చూసేది.

లాంతరు వెలుగులో మనవడు తన బుల్లి బుల్లి కాళ్ళు చేతులు ఆడిస్తూ కదులుతుంటే ముచ్చటపడిందామె.

కేవలం సంతోషాన్ని మాత్రమే కాకుండా దుఃఖాన్ని ఆ లాంతరు సమక్షంలోనే దిగమింగుకుంది. కామెర్లు వొచ్చి భర్త చనిపోయినప్పుడు పెళ్ళయిన కొత్తలో లాంతరు కొనిచ్చిన భర్తను తలచుకొని బాధపడింది. బస్సు ప్రమాదంలో కూతురు అల్లుడు చనిపోతే లాంతరుతోనే తన మనస్సులోని బాధను చెప్పుకుంది.

గాజుల చప్పుడు వినిపించడంతో ఆమె ఆలోచనలు తెగిపోయాయి.

కళ్ళు విప్పింది గేటు తీసుకుని వరండావైపు వొస్తున్న అమ్మాయిని చూసి గుర్తుపట్టిందామె.

"మన అరుణరా!" అంది దుర్గమ్మ గొంతు పెద్దది చేసి.

"నీకు మతి పోతుందే.... 'మన అరుణ ఏమిటి'? 'అరుణ' అని చెప్పరాదు" అన్నాడు నారాయణ విసుగ్గా.

"గోంగూర పచ్చడి తెచ్చాను నాయనమ్మా!" అంది అరుణ నవ్వుతూ.

"నా తల్లే... ఈ ముసలిదాన్ని పట్టించుకునేది నువ్వొక్కదానివే నమ్మా! పెద్దదాన్ని కదా అన్ని రుచులు కోరుతుంది నాలుక.... ఏది అడిగినా లేదనకుండా తెచ్చిపెడతవ్ నా బంగారు తల్లి!" అంది దుర్గమ్మ అరుణను దగ్గరకు తీసుకుని నొళ్ళంతా నిమురుతూ.

నారాయణకు చిరాకువేసింది.

కరెంటు పోయినప్పుడు చీకట్లో అరుణ తమ యింటికి రావడం సుతరామూ నచ్చలేదు.

"గోంగూర పచ్చడి లేకపోతే చచ్చిపోతావా? నీకు బుద్ధి లేదు.... ఆ అమ్మాయికి బుద్ధిలేదు... చీకట్లో పడి రాకపోతే రేపొద్దున తెచ్చియివ్వచ్చుగా" అన్నాడు నారాయణ కసురుకుంటూ.

అరుణ మరోమాట మాట్లాడకుండా చిన్నబుచ్చుకుని అక్కడి నుండి వెళ్ళిపోయింది.

"నువ్వెంత మొద్దువిరా.... నీకంటే మీ తాతయ్య నయం" అనేసి లోపలికి వెళ్ళింది దుర్గమ్మ.

★★★★

నారాయణకు పెళ్ళిచేసుకోవాలనే ఆలోచన రాలేదు.

పెళ్ళిచేసుకొమ్మని దుర్గమ్మ మాత్రం అతని మీద వొత్తిడి తీసుకునొస్తూనే వుంది.

అరుణ అయితే ఈడుజోడు బాగుంటుందని ఆమె అనుకుంటూ వుండేది. ఆ ప్రస్తావన నారాయణ ముందు తెచ్చినప్పుడు ఖస్సుమనేవాడు.

అరుణ ఆకర్షణీయంగానే వుంటుంది. అందంతోపాటు అణుకువ కూడ వుంది. ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకొమ్మని అమ్మమ్మ పదేపదే అడగటం నారాయణకు నచ్చలేదు... తనంతట తాను యిష్టపడి చేసుకోవాలిగాని ముసలి అమ్మమ్మ చెబితే తను పెళ్ళి చేసుకోవడం ఏమిటి? అదీ అతనితత్వం.

పూలకోసమనో, పుస్తకం కోసమనో ఆ అమ్మాయి తరచూ తన యింటికి రావడం కూడ నారాయణకు నచ్చలేదు.

"అరుణ వొచ్చిందిరా" అంది దుర్గమ్మ నారాయణ గదిలోకొచ్చి.

"నీతో ఏదో పని వుండి వొచ్చి వుంటుంది. నా గదిలోకి వొచ్చి దండోరా వెయ్యాలా?" అన్నాడు నారాయణ చదువుతున్న పుస్తకంలో నుండి తలెత్తకుండానే.

"ముసలిదానితో ఆ పడుచుపిల్లకు ఏం పని వుంటుంది? నువ్వే కావాలట" అంది దుర్గమ్మ.

అమ్మమ్మ మీద వొళ్ళుమండింది అతనికి. ఆమె మాటలు అరుణ ఎక్కడ వింటుందోనని బిడియ పడుతూ గదిలో నుంచి బయటకు రాబో

●●●

లాంతరు వెలుగులో ఆ రాత్రి మొగుడి కౌగిట్లో కరిగిపోయిందామె.

●●●

**అమ్మమ్మ మనసు ఆ అమ్మాయికి తెరచిన పుస్తకమే!**

యేడు. అదే సమయంలో గదిలోకి రాబోతున్న అరుణను ఢీకొట్టాడతను. ఆమె చేతుల్లోని బొమ్మకుక్క ఎగిరి గంతేసింది.

దుర్గమ్మ ఫక్కున నవ్వింది.

"మా కుక్కపిల్లకి యాంటిరాబిస్ ఇంజెక్షన్స్ వేయాలి" అంది అరుణ మెల్లగా.

"కుక్కపిల్లని హాస్పిటల్ కు తీసుకురా... అక్కడే ఇంజెక్షన్ వేస్తాను" అన్నాడు నారాయణ.

"పెళ్ళి కావాల్సిన ఆడపిల్ల కుక్కపిల్లల్ని తీసుకుని ఆసుపత్రి చుట్టూ ఏం తిరుగుతుందిరా అబ్బాయ్... నువ్వే తీసుకువెళ్ళి ఇంజక్షన్ చెయ్యి అంది దుర్గమ్మ.

ఏ గుణాన వున్నాడో నారాయణ మరో మాట మాట్లాడకుండా కుక్కపిల్లను హాస్పిటల్ కు తీసుకువెళ్ళాడు.

"అరుణకు సంబంధాలు చూస్తున్నారు... మాఘమాసంలో పెళ్ళి చెయ్యాలని తొందరపడుతున్నారు వాళ్ళ అమ్మానాన్నలు" అంది దిగులుగా దుర్గమ్మ మనవడితో,

"మంచి శుభవార్త చెప్పావ్ అమ్మమ్మా. మైసూర్ పాక్ చెయ్యి. మనిద్దరం తినేద్దాం" అన్నాడు నారాయణ నవ్వుతూ.

"చిన్నప్పటి నుండి మైసూర్ పాక్ లు, మీగడలు పెట్టి పెంచితే ఇప్పుడు నన్ను కాల్చుకు తింటున్నావ్" అంటూ నిజంగానే ఏడ్చేసింది దుర్గమ్మ.

అరుణను పెళ్ళిచేసుకుంటానని అనకపోవడమే తన నేరం అని నారాయణకు తెలుసు.

పువ్వును, పసిబాలుడిని చూస్తే మనస్సు సహజంగా ఎంత ముచ్చటపడుతుందో, నచ్చిన ఆడదాన్ని చూసినప్పుడు అంతే సహజంగా స్పందన రావాలని నారాయణ అభిప్రాయం.

ఆ విషయం అమ్మమ్మకు చెప్పినా అర్ధం కాదని మౌనంగా నిలబడి పోయేడు.

అరుణ వొచ్చింది చేతిలో పుస్తకాల దొంతరతో.

ముక్కు తుడుచుకుని అరుణను పలకరించి కాఫీ కలుపుతు అడిగేడు నారాయణ.

"ఆ పుస్తకాలన్నీ అప్పుడే చదివేశారా?" నవ్వుతూ అరుణను అడిగేడు నారాయణ.

"సాహిత్యంలో మీకు మంచి అభిరుచి వున్నట్లుంది.... మీ దగ్గర అన్నీ మంచి పుస్తకాలే వున్నాయి" అందామె.

వాళ్ళిద్దరూ సాహిత్యం గూర్చి మాట్లాడుకోవడం మొదలుపెట్టారు. కాఫీ కలుపుకు రావడానికి వంటగదివైపు వెళ్ళిన అమ్మమ్మ మధ్యలో రెండు మూడు సార్లు తన గది ముందు తచ్చాడటం, గదిలోకి తొంగి చూడటం నారాయణ గమనించేడు.

"నీకు యిదేం బుద్ధి? గదిలోకి తొంగి చూస్తావ్ ఎందుకు?" అమ్మమ్మను అరుణ వెళ్ళిపోయాక అడిగేడు.

"నా ముచ్చట నాది" అంది దుర్గమ్మ.

"మా మధ్య ఏం ముచ్చట్లు జరుగలేదు. నువ్వు సంతోషపడటానికి"

"నువ్వో మొద్దు సన్నాసిని.... మీ తాతయ్యే నయం నీకంటే!"

"నీతో మాట్లాడటం నా బుద్ధి తక్కువే!" అంటూ ఇంట్లో నుండి హాస్పిటల్ వైపు నడిచేడు నారాయణ.

★★★★

దుర్గమ్మకు వొళ్ళు తెలీని జ్వరం మంచానికి అతుక్కుపోయింది.

నారాయణకు కాళ్ళు చేతులు ఆడలేదు.

....అమ్మమ్మ ఎప్పుడూ ముక్కు చీది ఎరగదు. తలనొప్పి అనిగాని, జ్వరమని గాని ఎప్పుడూ అన్నం తినడం మానెయ్యలేదు. వారం రోజుల నుండి తిండి తిప్పలు లేకుండా మంచానపడిన అమ్మమ్మను చూడగానే నారాయణ గుండె తరుక్కుపోయింది.... తనకు తల్లి తండ్రీ అమ్మమ్మే! అమ్మమ్మతో తనకు అంత అనుబంధం వుంది కాబట్టే మరో స్త్రీ తన యింట్లో అడుగు పెట్టడానికి యిష్టపడటం లేదేమో? అమ్మమ్మ నిరాదరణకు గురైతే తను సహించలేదు!

అమ్మమ్మ తనకు దూరమైతే భరించగలడా:

అమ్మమ్మ తొందరగా కోలుకోవాలి!

మనస్సులో వేయి దేముళ్ళకి మొక్కుకున్నాడు.

అరుణ అమ్మమ్మను కనిపెట్టుకుని వుంటున్నది. రాత్రి ప్రొద్దుపోయేకగాని యింటికి తిరిగి వెళ్ళడం లేదా అమ్మాయి.... వంటా వార్పు అంతా ఆ అమ్మాయిదే. ఆ అమ్మాయిని తను పెళ్ళి చేసుకోవడం లేదని తెలిసినా ఎందుకని అమ్మమ్మకు సపర్యలు చేస్తున్నది.

అమ్మమ్మతో ఆ అమ్మాయికి వున్న సాన్నిహిత్యం, మనిషికి తోటి మనిషి సాయపడాలనే తపన అరుణ మొహంలో స్పష్టంగా కన్పించేయి.

## కె.రాఘవేంద్రరావు చిత్రాల్లో రమ్యకృష్ణ



ఆమె నటించిన చిత్రం ఫ్లాప్ అవుతుందని, ఆమె హేండ్ మంచిది కాదని చిత్ర పరిశ్రమలో వింతగా ప్రచారం జరిగింది. ఆ నటి నటించిన ప్రతి చిత్రం వరుసగా హిట్ అవుతోంది. ఆ చిత్రాలన్నింటికీ ఒకే దర్శకుడు పని చేసారు. ఆ నటే రమ్యకృష్ణ. ఆ దర్శకుడు కె.రాఘవేంద్రరావు. 'అల్లుడుగారు' చిత్రం ద్వారా రమ్యకృష్ణకు బ్రేక్ ఇచ్చారు రాఘవేంద్రరావు. ఆ తరువాత వరుసగా అల్లరిమొగుడు, మేజర్ చంద్రకాంత్, అల్లరి ప్రియుడు ప్రస్తుతం చిరంజీవి కొత్త చిత్రంలో రమ్యకృష్ణ నటిస్తోంది. రమ్యకృష్ణ నటించిన చిత్రాలన్ని హిట్ అవుతున్నప్పటికీ వేరే చిత్ర నిర్మాతలు ఈవిడను మాత్రం తీసుకోవడం లేదు. ఇంకా రాఘవేంద్రరావే ఎంకరేజ్ చేస్తున్నారు.

— నారాయణరాజు

మొట్టమొదటి సారిగా అరుణంటే అతనికి సదభిప్రాయం ఏర్పడింది.

మందు ఎండలో టౌనుకువెళ్ళి పాత లాంతరు బాగుచేయించుకు వొచ్చింది అరుణ. అమ్మమ్మ మనస్సు ఆ అమ్మాయికి తెరచిన పుస్తకమే.

అమ్మమ్మకు లాంతరు బాగుచేయించిన విషయం చెబితే కొద్దిగా కళ్ళు తెరిచి అరుణవైపు కృతజ్ఞతాపూర్వకంగాచూసింది.

సాయంత్రం డాక్టరు వొచ్చి దుర్గమ్మను చూసి వెళ్ళబోతుంటే ఆమె ఆరోగ్య పరిస్థితి గూర్చి అడిగేడు నారాయణ.

"పెద్ద వయస్సు కదా! ఆమెను జాగ్రత్తగా చూసుకోండి.... ఆమె ఏది అడిగినా యివ్వండి! ఈ రాత్రి గడిస్తే ఆమె గట్టెక్కినట్టే!"

డాక్టరు మాటలు నారాయణను కంగారుపెట్టేసేయి. వోప్రక్క అమ్మమ్మ చనిపోతుందేమో నన్న భయం, మరోప్రక్క రాత్రి గడిస్తే అమ్మమ్మ మామూలుగా లేచి తిరుగుతుందనే ఆశ అతని మనస్సును వొత్తిడికి గురిచేశాయి.

"ఈ రాత్రికి నువ్వు యిక్కడే వుండిపో అరుణా!" అరుణతో అన్నాడు.

తలూపిందామె.

మగతగా పడుకుని వుంది దుర్గమ్మ. అప్పుడప్పుడు మాత్రం కొద్దిగా కళ్ళు తెరిచి చూస్తూ వుంది. మంచం ప్రక్కనే కూర్చున్నారు వాళ్ళిద్దరూ.

అరుణ మనస్సులో ఏదో ఆలోచన మెదిలింది.

పాతలాంతరుతీసి నిండా కిరోసిన్ పోసి వెలిగించింది. కరెంటు స్విచ్ ఆఫ్ చేసింది.

గదంతా లాంతరు వెలుగు మసక మసగ్గా వ్యాపించింది.

కరెంటు వున్నా తీసేసి లాంతరు వెలిగించడం మొదట్లో నారాయణకు అర్థం కాలేదు. కానీ కళ్ళు తెరిచినప్పుడల్లా ఎదురుగా స్తంభానికి వ్రేలాడదీసిన లాంతరు కన్పిస్తూ వుండటంతో దుర్గమ్మ మొహంలో మార్పు గమనించాడతను.

దుర్గమ్మకు కొంచెం ఓపిక వొచ్చింది. ఆమె చేతి జానతాగించింది అరుణ. అరుణ తల్లిదండ్రులు కూడ వొచ్చి తోడుగా వుంటామని యింట్లోనే వుండిపోయారు.

కృతజ్ఞతాభావంతో ఊగిపోతూ అరుణ చేతిని తన చేతుల్లోకి తీసుకుని నిమిరేడు నారాయణ.

దుర్గమ్మ కళ్ళు మెరిసేయి.

"అరుణ చెయ్యి వొదలొద్దురా అబ్బాయ్ !" అంది దుర్గమ్మ.

నాతిలోంచి వచ్చినట్లుగా వున్నాయి ఆ మాటలు.


"అరుణను పెళ్ళిచేసుకుంటాను అమ్మమ్మా. మా పెళ్ళి నువ్వు చూడాలి" అన్నాడు దుర్గమ్మ మొహానికి తన మొహం ఆనించి.

"నాకిప్పుడు ఏ బాధ లేదురా అబ్బాయ్... ప్రాణానికి హాయిగా వుంది. ఈ రాత్రికి నేను చనిపోతే అరుణ కడుపులోకి దూరతాను. బ్రతికితే ముని మనవడిని చూసే వరకూ నావను. రెండింటికి నేను సిద్ధమే! ఆపైన భగవంతుడి దయ.... తన దగ్గరకు తీసుకువెళ్ళతాడో... కొన్నాళ్ళు బ్రతకమంటాడో?" నారాయణ మొహం తన చేత్తో నిమురుతూ అంది దుర్గమ్మ.

ఆ రాత్రి అంతా లాంతరు వెలుగుతూనే వుంది.

లాంతరు వెలుగు దుర్గమ్మ మొహం మీద పడుతూనే వుంది. ●

## హీరో కృష్ణ మళ్ళీ బిజీ



కొన్ని రోజుల గ్యాప్ అనంతరం ఈ సంవత్సరం సచ్చిన సంసారం, నారాసుడు చిత్రాల విజయంతో హీరో కృష్ణ మళ్ళీ బిజీ హీరో అయ్యారు. తెలుగు చిత్ర పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేక ఇమేజ్ గల నటుడు కృష్ణ. మొహమాటం వల్ల చిత్రాలు ఒప్పుకుని అవి పరాజయం చెందడంతో తాత్కాలికంగా వెనుకబడ్డారు. కాని ఈసారి అలా కాకుండా కథ నచ్చితేనే చిత్రం అంగీకరిస్తానని కృష్ణ చెప్పారు. ఆ నమ్మకంతోనే వరుసగా అయిదు హిట్ చిత్రాల్లో నటిస్తానని చెప్పగలిగిన ధైర్యం, నమ్మకం హీరో కృష్ణకే ఉంది. రౌడి అన్నయ్య చిత్రం నిర్మాణంలో ఉంది. గత వారం రవిచంద్ర దర్శకత్వంలో విజయశాంతి జోడిగా మరో చిత్రం ప్రారంభమైంది. త్వరలో మరికొన్ని చిత్రాలు ప్రారంభం కావలసి ఉంది.

— నారాయణరాజు.


## అపూర్వశక్తిగల ఉంగరం

మీరు ఇప్పుడు నిరాశచెందకండి. శుభముహూర్తంలో గ్రహాణానుసారం తయారుచేయబడిన ఈ తాంత్రిక ఉంగరం ధరించడం వలన కోరుకున్న స్త్రీ లేదా పురుషుని వశం చేసుకునే వీలుంది. కఠిన హృదయులు కూడా మీ వశంలోకి వచ్చి, మీ అడుగు జాడలలో నడుచుకుంటూ మీ ఆజ్ఞను శిరసావహిస్తారు. ఇష్టపడినవారితో వివాహం జరుగుతుంది. ఉద్యోగం దొరుకు తుంది. ప్రేతాత్మలతో మాట్లాడవచ్చు. కోర్టులో గెలిచే అవకాశం ఉంది. పరీక్షలలో ఉత్తీర్ణులవ్వవచ్చును. వ్యాపారంలో లాభం వస్తుంది. దుష్టగ్రహాలు శాంతిస్తాయి. జీవితం సుఖశాంతులతో నడుస్తుంది.

ఈ తాంత్రిక ఉంగరం యొక్క వెల రూ. 51/-24 గంటలలో వెంటనే ప్రభావం చూపిస్తుంది. మీ పేరు ప్రకారం అష్టధాతువులతో తయారుచేయబడుతుంది. చాందీవారి ప్రత్యేక సికిందర్ ఉంగరం వెల రూ. 101/- తపాలా ఖర్చులు అదనంగా చెల్లించవలసి ఉంటుంది. ఈ ఉంగరాల ప్రభావం ఎప్పుడూ తప్పుగా పనిచేయదు. వీటి ప్రభావం సరిగా కనుక లేకుంటే మీరు చెల్లించిన మూల్యానికి రెట్టింపు వాపసు చేయబడుతుంది. ఇది వాస్తవం కాదని నిరూపించగల్గినట్లయితే అట్టివారికి రూ. 1000/- నగదు రూపములో ఇవ్వబడుతుంది. ఒకసారి వాడి చూడండి మీకే తెలుస్తుంది.

V.P.P.ద్వారా తెప్పించుకునే చిరునామా:

DADHICHI ASHRAM (M)

P.O. Maira Barith (GAYA)